

శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 9.41.811

బంగారం : 7 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

వెండి : 119 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



చెక్‌డ్యామ్‌లో మృతదేహం

కలిమెల సమితిలోని ఓ చెక్‌డ్యామ్‌లో మృతదేహం దొరికింది. మృతుడు టీచర్‌గా నిర్ధారించారు.

- 8లో



భారీగా గంజాయి పట్టివేత

జయపురం అడవిలో భారీగా గంజాయి దొరికింది. నిందితులను పట్టుకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న పొట్టంగి ఎమ్మెల్యే



సింహాచలం దేవస్థానం సన్నిధిలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా పొట్టంగి ఎమ్మెల్యే రాంచంద్ర ఖడం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా సింహాచలంలోని సింహాద్రి అప్పన్నను ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిసారి సార్వత్రిక ఎన్నికల ఫలితాలు అనంతరం ఒడిశాకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రత్యేకంగా వచ్చి సింహాద్రి అప్పన్నను దర్శించుకొని పూజలు చేయడం ఆనవాయితీ.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



ఘెను కరలియ మృతదేహం

జయపురం: విద్యుదాఘాతంతో యువడుకు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో చోటుచేసుకుంది. బొయిపరిగుడ సమితి ఖెందుగుడ పంచాయతీ జనతాగుడ గ్రామం ఘెను కరలియ (32) శుక్రవారం కావిడిగుడ గ్రామంలో బంధువుల వివాహానికి వెళ్లాడు. సాయంత్రం బంధువులతో కలిసి భోజనాల కోసం వెళ్లగా అక్కడ చీకటిగా ఉందని.. ఘెను కరలియ విద్యుత్ స్తంభం ఎక్కి పెళ్లి పందిరికి ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరం లైన్‌కు తీగను కలిపాడు. ఆ సమయంలో స్తంభం నుంచి 230 వాల్టుల ఎల్‌టీ వైర్ తెగి ఘెను కరలియ పడింది. దీంతో షాక్‌కుగురయ్యాడు. వెంటనే స్థానికులు అతన్ని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్పించగా.. వైద్యులు పరీక్షించిన ఘెను మరణించినట్లు ప్రకటించారు. ఈ సంఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు ఆదివారం బొయిపరిగుడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

రాయగడ: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కాసీపూర్ సమితి టికిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోకులమండ గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలిని అదే గ్రామానికి చెందిన హేమంత సాహు భార్య రాజేశ్వరి(34)గా గుర్తించారు. ఐఐసీ విశ్వబుధుని బాగ్ తెలిపిన వివరాల ప్రకారం .. కొన్నాళ్ల క్రితం సాహు టికిరిలోని రాజేశ్వరిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి 11 ఏళ్ల కుమార్తె కూడా ఉంది. ఏం జరిగిందో గానీ శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాజేశ్వరి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సేవలకు సత్కారం

- అత్యుత్తమ సిబ్బందికి విశిష్ట్ రైల్ సేవా పురస్కారాలు
- తూర్పు కోస్తా రైల్వేలో 49 మందికి ప్రదానం

భువనేశ్వర్: విధి నిర్వహణలో అందించిన అత్యుత్తమ సేవలకు గాను తూర్పు కోస్తా రైల్వే విశిష్ట రైలు సేవా పురస్కారం-2024 ప్రదానం చేసింది. భువనేశ్వర్‌లోని రైల్వే ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జోన్ వ్యాప్తంగా 49 మంది రైల్వే ఉద్యోగులను పురస్కారంతో సత్కరించింది. విధుల నిర్వహణలో తాము అందించిన సేవ, అంకితభావాన్ని గుర్తించి అవార్డులు అందజేయడం పట్ల పురస్కార గ్రహీతలు ఆనందం వ్యక్తం చేశారు. జోన్ వ్యాప్తంగా మండల స్థాయి సామర్థ్యానికి ప్రతీకగా సమర్థతా షీల్డ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ మాట్లాడుతూ సంస్థ లక్ష్యాలను చేరుకోవడంలో సిబ్బంది కృషి అభినందనీయమని ప్రశంసించారు.

- సంబల్‌పూర్ రైల్వే మండలం సమగ్ర సమర్థతా షీల్డ్ అందుకుంది. ఉన్నత ప్రమాణాలతో దైనందిన కార్యకలాపాలు నిర్వహించి జోనల్ స్థాయిలో ఈ షీల్డ్‌ను కైవసం చేసుకోవడం విశేషం.
- ఖుర్దా రోడ్ మండలం పూరీ, హరిదాస్‌పూర్ స్టేషన్లు అత్యుత్తమ పరిశుభ్రత స్టేషన్లుగా ఎంపికయ్యాయి. పూరీ పెద్ద స్టేషన్, హరిదాస్‌పూర్ చిన్న స్టేషన్ విభాగాల్లో ఉత్తమ పరిశుభ్రత స్టేషన్ షీల్డ్‌లు గెలుచుకున్నాయి.
- వివిధ విభాగాల అత్యుత్తమ పని తీరు ప్రదర్శించిన వాల్తేరు మండలం ఆరు ఉత్తమ నైపుణ్య షీల్డుల్ని కైవసం చేసుకుంది. తూర్పు కోస్తా రైల్వే సెంట్రల్ హాస్పిటల్ భువనేశ్వర్‌తో వాల్తేరు మండలం రైల్వే ఆస్పత్రి ఉమ్మడిగా ఉత్తమ నైపుణ్య షీల్డ్ అందుకున్నాయి. ఇతర విభాగాల్లో వాణిజ్యం, సివిల్ ఇంజినీరింగ్, రక్షణ, స్టోర్స్ డిపో, ట్రాక్ మెషిన్ డిపో ఈ పురస్కారం అందుకుని ఉన్నతాధికారుల ప్రసంశలు పొందాయి.
- తూర్పు కోస్తా రైల్వే మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు కవితా ఫంక్వాల్, అదనపు జనరల్ మేనేజర్ మోహెస్ కుమార్ బెహెరా, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బి.కె.మిశ్రా, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.కె.కదంగ ఇతర విభాగాల ప్రముఖ అధికారులు జోనల్, మండల స్థాయి సీనియర్ అధికారులు విశిష్ట రైల్ సేవా పురస్కార్ - 2024 ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజరు 69వ విశిష్ట రైల్ సేవా పురస్కార్ సంచికను ఆవిష్కరించారు.



69వ విశిష్ట రైల్ సేవా పురస్కార్ సంచికను ఆవిష్కరించిన జనరల్ మేనేజర్‌తో ఇతర ప్రముఖులు



6 ఉత్తమ నైపుణ్య షీల్డులు అందుకున్న వాల్తేరు మండలం అధికారులు



అత్యుత్తమ పెద్ద పరిశుభ్రత స్టేషన్ పురస్కారం అందుకుంటున్న పూరీ అధికారులు



అత్యుత్తమ చిన్న పరిశుభ్రత స్టేషన్ పురస్కారం అందుకుంటున్న హరిదాస్‌పూర్ అధికారులు



రన్నింగ్ రూమ్ నిర్వహణ షీల్డు అందుకున్న పూరీ, ఖుర్దారోడ్ స్టేషన్ల సిబ్బంది



ఉత్తమ భద్రతా విభాగం



ఉత్తమ ఆపరేటింగ్ విభాగం పురస్కారం అందుకున్న సంబల్‌పూర్ డీఆర్ఎంతో సిబ్బంది



సమగ్ర నైపుణ్యత అవార్డు అందుకున్న సంబల్‌పూర్ మండలం సిబ్బంది



సిగ్నల్ అండ్ టెలికాం నైపుణ్యత అవార్డు అందుకుంటున్న సిబ్బంది



ఉత్తమ రాజభాష అవార్డు అందుకున్న సంబల్‌పూర్ మండల సిబ్బంది



ఉత్తమ రైలు మదద్ సేవల అవార్డు అందుకున్న సంబల్‌పూర్ మండల సిబ్బంది



ఉత్తమ కార్మిక విభాగం అవార్డు అందుకున్న సంబల్‌పూర్ మండల సిబ్బంది



ఉత్తమ యాంత్రిక విభాగం అవార్డు అందుకున్న సంబల్‌పూర్ మండల సిబ్బంది



ఉత్తమ ఆర్థిక విభాగం అవార్డు అందుకున్న సంబల్‌పూర్ మండల సిబ్బంది

స్ట్రాబెర్రీ విక్రయ కేంద్రం ప్రారంభం



స్ట్రాబెర్రీ విక్రయశాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్

కొరాపుట్: స్ట్రాబెర్రి విక్రయ కేంద్రం ప్రారంభమైంది. దీన్ని ఆదివారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి సమీపంలో జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ దీన్ని ప్రారంభించారు. కొరాపుట్ జిల్లా కొరియాలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పని చేసి గిరిజనులకు స్ట్రాబెర్రి పంట సాగుపై అవగాహన కల్పించారు. అందుకు తగ్గ శిక్షణ, ఆర్థిక సహాయం చేశారు. అయితే అక్కడ అధిక ఉత్పత్తి సాధించినప్పటికీ మార్కెట్ సాగలేదు. దాంతో ప్రభుత్వం మరలా జోక్యం చేసుకొని గిరిజనులకు స్ట్రాబెర్రి సాగుపై ప్రోత్సహించే క్రమంలో విక్రయ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్ట్రాబెర్రి సాగు చేస్తున్న గిరిజన రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుష్పాలంకరణ



పూజలందుకుంటున్న దేవతామూర్తులు

జయపురం:

జయపురంలోని జగన్నాథ్ మందిరంలో మాఘ చతుర్థి సందర్భంగా జగన్నాథ సుభద్ర బలభద్రలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకున్నారు.

బోరు మరమ్మతును పర్యవేక్షించిన ఎమ్మెల్యే

కొరాపుట్: బోరు మరామ్మతులో బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి స్వయంగా పాల్గొన్నారు. నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి సింధిగుడ గ్రామ పంచాయతీ తురింజి గూడ గ్రామాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. అక్కడ గిరిజన మహిళలు తాము మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ సిబ్బందిని రప్పించి బోరుకు మరమ్మతులు చేపట్టారు. ఈ పనుల్లో ఎమ్మెల్యే కూడా పాల్గొన్నారు. పనులు పూర్తయి నీరు వచ్చేవరకూ అక్కడ ఉంది పర్యవేక్షించారు. ఎమ్మెల్యేకి స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.




పైపులు ఎత్తుతున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి (తెల్ల టీ షర్ట్)

ప్రమాదాన్ని తెచ్చిన రీల్స్‌మోజు!

- రిజర్వాయర్‌లో ఇద్దరు విద్యార్థులు గల్లంతు
- సురక్షితంగా బయటపడిన మరొకరు



జోలాపుట్ రిజర్వాయర్ వద్ద గుమిగూడిన ప్రజలు



ప్రమాదానికి ముందు పడవలో ముగ్గురు విద్యార్థులు

కొరాపుట్: రీల్స్ మోజు ప్రమాదాన్ని తెచ్చింది. నాటుపడవలో రిజర్వాయర్‌లో షికారుకు వెళ్లిన ముగ్గురు విద్యార్థుల్లో ఇద్దరు గల్లంతవ్వగా.. ఒకరు సురక్షితంగా బయటపడ్డాడు. ఈ సంఘటన కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి జోలాపుట్ రిజర్వాయర్ ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ముగుర్గు విద్యార్థులు పెద్దలకు తెలియకుండా నాటు పడవలో రీల్స్ చేసేందుకు రిజర్వాయర్ లోనికి వెళ్లారు. అయితే వారు సక్రమంగా పడవను నడపలేకపోవడంతో నీట మునిగింది. వారిలో ఒకరు ఈదుకుంటూ ఒడ్డుకు చేరడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మిగిలిన ఇద్దరు గల్లంతయ్యారు. గల్లంతయిన వారిలో జోలాపుట్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న శివ హంతల్ (14), అమిత్ హంతాల్ (14) ఉన్నారు. అధికారులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రిజర్వాయర్ వద్దకు చేరుకొని గల్లంతయిన పిల్లల కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు.

లాయర్‌పై దాడి కేసులో ఇద్దరు అరెస్టు

పర్లాకిమిడి: న్యాయవాది పత్తి రామారావు కేసులో ఎట్టకేలకు ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకోగలిగారు. ఆదివారం ఉదయం పర్లాకిమిడి ఆదర్శ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎస్పీ జితేంద్ర కుమార్ పండా ఆ ఇద్దరు నిందితులను ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. గత ఏడాది (2024) నవంబరు 9 సాయంత్రం ఇద్దరు వ్యక్తులు ఒక పల్సర్ బైక్‌పై జంగంవీధిలో ఉంటున్న న్యాయవాది పత్తి రామారావు ఇంటికి వచ్చి కాలింగ్ బెల్‌ను అదేపనిగా కొట్టారు. న్యాయవాది లేచి డోర్ తెరవగానే అగంతకులు యాసిడ్ ముఖంపై పోసి సంఘటనా స్థలం నుంచి పారిపోయారు. దీంతో న్యాయవాది కళ్లు, ముఖం, కడుపు ఒంటి మీద యాసిడ్ పడి కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఇతర న్యాయవాదులు వెంటనే విశాఖపట్నం తీసుకువెళ్లారు. ఈ కేసు దర్యాప్తులో ఎస్పీ జితేంద్ర కుమార్ పండా స్వయంగా విశాఖపట్నం వెళ్లి చికిత్స పొందుతున్న రామారావును వివరాలు అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. అయితే అప్పట్లో న్యాయవాది పత్తి రామారావు బదులు చెప్పలేకపోయారు. ఈ సంఘటన జరిగిన తర్వాత స్థానిక జంగం వీధిలో సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా సైబర్ క్రైం పోలీసులు, రంగంలోకి దిగి ఫోన్ కాల్స్, బైక్ వివరాలతో దర్యాప్తు చేశారు. విశాఖపట్నంలో స్థిరపడిన పర్లాకిమిడి వాసి, విశ్రాంత ఎస్‌బీఐ మేనేజరు దాకోజు వెంకట్రావు ఆచారిని ప్రధాన నిందితుడిగా గుర్తించి ఆయనను విజయవాడలో పట్టుకున్నారు. అలాగే మరో నిందితుడు విశాఖపట్నం కంచలపాలెంకు చెందిన దూడ సతీష్‌ను విశాఖపట్నంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కుతుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు.



పత్తి రామారావుపై యాసిడ్ దాడి కేసులో నిందితులతో ఎస్పీ జితేంద్రకుమార్ పండా, ఐఐసీ ప్రశాంత భూపతి, ఎస్‌డీపీఓ మాధవానందనాయక్

ఆర్థిక లావాదేవీలే కారణం..

ఈ కేసులో ప్రధాన నిందితుడు దాకోజు వెంకట్రావు గతంలో తన స్నేహితుడు బార్, రెస్టారెంటు యజమాని ఇంజా వెంకటరమణకు రూ.31 లక్షలు రుణం ఇచ్చాడు. తర్వాత ఆయనకు వ్యాపారంలో నష్టం వచ్చిందని దాకోజు వెంకట్రావు సహాయంతో స్టేట్ బ్యాంకులో మరో రూ.55 లక్షలు అప్పునకు తనే ష్యూరిటీ ఇచ్చి లోన్ ఇప్పించాడు. అయితే తిరిగి ఆ డబ్బులు కూడా వెంకటరమణ తిరిగి ఇవ్వకపోవడంతో, చివరకు దాకోజు వెంకట్రావు ఇంజీ వెంకటరమణ ఇచ్చిన ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోటు, దస్తావేజులు న్యాయవాది పత్తి రామారావు వద్దకు తీసుకువెళ్లి కేసు వేయించాడు. అయితే న్యాయవాది ద్వారా ఈ కేసులో పురోగతి పరిష్కారం సకాలంలో లభించక పోవడం, తర్వాత న్యాయవాదితో అభిప్రాయ భేదాలు రావడం వల్ల ఇచ్చిన డాక్యుమెంట్లు, ప్రామిసరీ నోటు తిరిగి ఇవ్వమని అడిగాడు. అందుకు న్యాయవాది ఒప్పుకోకపోవడంతో ఆయనకు బుద్ధి చెప్పాలని పథకం వేసుకున్నాడు. దీని ప్రకారం నిందితుడు దాకోజు వెంకట్రావు విశాఖపట్నంకు చెందిన దూడ సతీష్, వి.కిరణ్‌లకు అడ్వాన్సుగా ఒక లక్ష రూపాయలు చొప్పున్న ఇచ్చి యాసిడ్ దాడికి పాల్పడ్డాడని జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా తెలియజేశారు. ఈ కేసులో మరో నిందితుడు వి.కిరణ్ పరారీలో ఉన్నాడని పోలీసు ఎస్పీ పండా తెలియజేశారు. ఈ విలేకరుల సమావేశంలో సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, ఐఐసీ ప్రశాంత భూపతి తదితరులు పాల్గొన్నారు.

431 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం



కేసుకు సంబంధించి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ స్వాతి పక్కనే ఎస్‌డీపీఓ సేనాపతి తదితరులు



నిందితుని నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

రాయగడ:

జిల్లాలోని అంబొదల పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఏడాది డిసెంబర్ 9న జరిగిన ఒక చోరీ కేసుకు సంబంధించి పోలీసులు ఒక నిందితుడిని పట్టుకున్నారు. అతడి నుంచి 431 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ ఈ మేరకు ఆదివారం సాయంత్రం జిల్లా పోలీస్ కార్యాలయం సమావేశంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. అంబొదలలో గల ప్రవాసిని సాహు అనే బంగారు షాపు యజమాని గత ఏడాది డిసెంబరు 9 ఉదయం 8.30 గంటల సమయంలో షాపు తెరిచాడని, ఈ క్రమంలో అతను సుమారు 500 గ్రాముల బంగారు ఆభరణాలను ఒక బ్యాగులో ఉంచగా గుర్తు తెలియని దుండగుడు బ్యాగును లాక్కుని పరారైపోయాడు. అనంతరం బాధితుడు అంబొదల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడినిను అరెస్టు చేసి అతని నుంచి బంగారు భరణాలతొ సహా బైకును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు నిర్వహించిన విలేకర్ల సమావేశంలొ ఎస్‌డీపీఓ రశ్మీరంజన్ సేనాపతి, అంబొదల ఐఐసి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా సరస్వతీ పూజలు


జగన్నాథ్ మందిరం వద్ద చిన్నారులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని కళాశాలలు, పాఠశాల్లోల వసంతపంచమి సందర్భంగా ఆదివారం సరస్వతీదేవి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సరస్వతి శిశు మందిర్‌లో 35 మంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ముందుగా జగన్నాథ్ స్వామి దేవాలయంలో చిన్నారులతో పూజలు చేయించారు.

చిత్తడి నేలలను రక్షించుకోవాలి


సమావేశంలో పాల్గొన్న అతిథులు

మల్కన్‌గిరి: చిత్తడి నేలలను రక్షించుకోవాలని వక్తలు అన్నారు. మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనినిమిద కిలోమీటర్ల బైక్ ర్యాలీ నిర్వహించి.. చిత్తడినేలల ప్రాధానతపై నినాదాలు చేశారు. గోవిందపల్లి అటవీ కార్యాలయం వద్ద నుంచి మత్తిలి బళదియాగూఢ వరకు ర్యాలీ సాగింది. అనంతరం జరిగిన సభలో ప్రేరణ మహిళా ట్రస్టు అధ్యక్షురాలు సంతోషిని పాత్రో, సృష్టి స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త కిశోర్ కుమార్ పాతిక ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మత్తిలి అటవీశాఖ అధికారి వాసుదేవ్ నాయక్ చిత్తడినేలల ప్రాధాన్యతను వివరించారు.

టిఫిన్ షాపులోకి దూసుకెళ్లిన లారీ


షాపులోకి దూసుకుపోయిన లారీ

ఆమదాలవలస: మండలంలోని పార్వతీశంపేట జంక్షన్ వద్ద ఆమదాలవలస- హిరమండలం రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున సరుబుజ్జిలి వైపు నుంచి శ్రీకాకుళం వెళ్తున్న లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న టిఫిన్ షాపులోకి దూసుకెళ్లింది. పార్వతీశంపేట జంక్షన్ వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. తెల్లవారుజామున షాపులో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని అంటున్నారు. పొగమంచు కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

చిత్తడి నేలలతోనే జీవం మనుగడ


సోంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

సోంపేట: చిత్తడి నేలలను పరిరక్షించడంతోనే జీవం మనుగడ సాధ్యమవుతుందని పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డాక్టర్ వై.కృష్ణమూర్తి అన్నారు. ప్రపంచ చిత్తడి నేలలు దినోత్సవం సందర్భంగా సోంపేటలో ఆదివారం పలు కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలో కళాసీసంఘ భవనంలో విద్యార్థులకు చిత్తడి.నేలలు పరిరక్షణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ కృష్ణమూర్తి, గ్రీన్ క్లెమైట్ వ్యవస్థాపకుడు జె.వి.రత్నం, పర్యావరణ పరిరక్షకుడు బి.సత్య తదితరులు ప్రసంగిస్తూ చితడి నేలల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామినాయుడు, పాపారావు, ఎం.ఈశ్వరరావు, పర్యావరణ, మత్స్యకార నాయకులు బి.సుందరరావు, సనపల శ్రీరామమూర్తి, ఎస్.విజయ్‌కుమార్, నాగు, వెంకన్న, టి.తేజేశ్వరరావు, బి.శంకరరావు, కోదండరావు, సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.


చదువు వద్దన్నారని..

• విద్యార్థిని ఆత్మహత్య

ఎచ్చెర్ల క్యాంపస్: ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఎచ్చెర్ల మండలం కొంగరాం పంచాయతీ ఏజీఎన్‌పేటకు చెందిన మింది పూర్ణ (19) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ(ఎంపీసీ) మొదటి ఏడాది చదువుతున్న పూర్ణ డిగ్రీ పూర్తిచేసి ఉన్నత చదువులు చదువుతానని కుటుంబ సభ్యులతో చెప్పింది. కుటుంబ సభ్యులు మాత్రం వివాహం చేసుకోవాలని ఒత్తిడి తెచ్చి సమీప గ్రామానికి చెందిన వ్యక్తితో పెళ్లి నిశ్చయించారు. దీంతో మనస్థాపానికి గురైన యువతి గత నెల 22న పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితికి చేరడంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయగా.. పది రోజులుగా మృత్యువుతో పోరాడి ఆదివారం మృతి చెందింది. తండ్రి గణేష్ ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసునమోదు చేశారు.

అభివృద్ధి నోచుకోని జంగొజొడి

• అర్ధంతరంగా నిలిచిన రహదారి పనులు


జంగొజొడి గ్రామం


అర్ధంతరంగా నిలిచిన రోడ్డు పనులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి పరిధిలో గల సునాఖండి గ్రామ పంచాయతీ పరిధిలోని జంగొజొడి గ్రామంలో మౌలిక సౌకర్యాలు లేక గ్రామస్తులు ఇక్కట్లు పడుతున్నారు. మాజీ మంత్రిగా వ్యవహరించే జగన్నాథ సరక ప్రాతినిధ్యం వహించే బిసంకటక్ నియోజకవర్గం పరిధిలో గల ఈ గ్రామం అభివృద్ధికి దూరంగా ఉంది. గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. సుమారు 40 కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామంలో అందరూ ఆదివాసీలే. రెక్కాడితే గానీ డొక్కడని జీవితాలు. గ్రామం నుంచి పంచాయతీ కార్యాలయానికి వెళ్లాలంటే నరక యాతన పడాల్సిందే. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని మొరపెట్టు కోగా గత ప్రభుత్వం చాటికొన నుంచి జంగొజొడికి అనుసంధానించే విధంగా సుమారు 10 కిలోమీటర్ల దూరం రహదారిని ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.6 కోట్ల నిధులను కేటాయించింది. ఈ క్రమంలో పనులు ప్రారంభించేందుకు టెండర్లు కూడా రెండేళ్ల క్రితం జరిగాయి. కొంత మొత్తం వరకు రొడ్డు పనులు చేసి మిగిలిన పనులను నిలిపివేశారు.

పాఠశాలకు వెళ్లని ఉపాధ్యాయులు

ఈ గ్రామంలో 2010లో ప్రాథమిక పాఠశాలను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇద్దరు ఉపాధ్యాయులను కూడా నియమించింది. పాఠాలు చెబుతున్నారా? లేదా అన్న విషయాన్ని సంబంధిత శాఖ అధికారులు మరిచారు. వారానికి కనీసం రెండు రోజులైనా ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చే దాఖలాలు లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ఉపాధ్యాయులు కూడా పాఠశాలకు వేళ్లేందుకు ఇష్టపడటం లేదు. దీంతో చదువులు లేక విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతుందని గ్రామస్తులు జెమ్మా హుయిక, మండి హుయిక, బుధురు హుయిక ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తే సమస్యలు దూరమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ గ్రామంలో తాగునీటి సమస్య ఉంది. 40 కుటుంబాలున్న ఈ గ్రామంలో సుమారు మూడు వందలకు పైచిలుకు జనాభా నివసిస్తున్నారు. తాగునీటి సౌకర్యార్థం రెండు గొట్టపు బావులు మాత్రమే ఉన్నాయి. ఇందులో ఒకటి పూర్తిగా పనిచేయకపోవడంతో తాగునీటి కష్టాలు పడుతున్నారు. రానున్న వేసవి లోగానైనా అధికారులు చర్యలు తీసుకుని గొట్టపు బావిని బాగుచేయాలని కోరుతున్నారు.

క్రీడాకారుడు కిశోర్ చంద్ర రథ్‌కు సత్కారం


బీజేపీ కార్యాలయంలో క్రీడాకారుడు కిశోర్ చంద్ర రథ్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు

పర్లాకిమిడి: ఇటీవల బ్యాంకాక్‌లో జరిగిన ఐదో ఓపెన్ మాస్టర్ గేమ్స్‌లో ప్రతిభ చాటిన పర్లాకిమిడి చెందిన క్రీడాకారుడు, అబ్కారీశాఖ విశ్రాంత ఎస్సై కిశోర్ చంద్ర రథ్‌ను మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షులు కోడూరు నారాయణ రావు తన పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కిశోర్ చంద్ర రథ్ అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ పురపాలక అధ్యక్షులు నృసింహా చరణ్ పట్నాయిక్, రైతు విజయకుమార్, చిట్టి తదితరులు ఉన్నారు.

క్రీడలు విద్యార్థుల చురుకుదనానికి ప్రతీకలు


క్రీడల్లో భాగంగా బెలూన్లను విడిచి పెడుతున్న ఏఎస్పీ పాత్రో


గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన దృశ్యం

రాయగడ: క్రీడలను ప్రోత్సహించడం వల్ల విద్యార్థుల్లో చురుకుదనం పెరుగుతుందని జిల్లా అదనపు ఎస్పీ విష్ణు ప్రసాద్ పాత్రో అన్నారు. స్థానిక న్యూకాలనీలో గల సెయింట్ జేవియర్స్ స్కూల్‌లో ఆదివారం జరిగిన వార్షిక క్రీడోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు ఆటల్లోనూ ప్రోత్సహించాలన్నారు. కేవలం నామమాత్రంగా నిర్వహించే క్రీడల వల్ల వారికి ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. ప్రతి రోజూ కనీసం అరగంట సమయం క్రీడల్లో పాల్గొనేలా చూడాలన్నారు. అంతకు ముందు మజ్జి గౌరి మందిరం నుంచి క్రీడా జ్యోతిని తీసుకువచ్చి పాఠశాల ప్రాంగణంలో నిలిపారు. కబడ్డీ, ఖో ఖో, పరుగు పందాలు, స్పూన్ రేస్ వంటి అంశాలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ పట్నాయక్, సీఈఓ అచ్యుతానంద సామంత రాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకు సేవా మిల్లు కార్మికులు సిద్ధం


సమావేశంలో పాల్గొన్న కార్మిక నేతలు


మాట్లాడుతున్న ప్రమోద్ మహంతి, తదితరులు

జయపురం: తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 9వ తేదీన ప్రజలతో సమావేశం నిర్వహించి, 13వ తేదీన ఆందోళన జరిపాలని గగణాపూర్ సేవా పేపరు మిల్లు కార్మిక నేతలు నిర్ణయించారు. ఆదివారం స్థానిక యాదవ భవనంలో కార్మిక నేత బసంత బెహర అధ్యక్షతన మిల్లు కార్మిక నేతలు, విశ్రాంత కార్మిక నేతలు, కంట్రాక్ట్ కార్మిక నేతుల కలిసి అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో అచల వ్యవస్థలో ఉన్న పేపరు మిల్లు పరిస్థితి, మిల్లులో పనిచేస్తున్న కార్మికులకు అనేక నెలల నుంచి లభించని జీతాల సమస్య, విశ్రాంత కార్మికుల దురవస్థ, మరణించిన కార్మికుల కుటుంబాల దుస్థితి, కంట్రాక్ట్ కార్మికుల పీఎఫ్ సమస్యలపై నాయకులు చర్చించారు. కంట్రాక్ట్ కార్మికుల ప్రతినిధి సుందర నాయక్ కార్మికుల దయనీయ స్థితిని వివరిస్తూ యాజమాన్యం పీఎఫ్ డబ్బులు జీతాల నుంచి మినహా ఇస్తున్నా వాటిని ఖాతాల్లోని జయ చేయటం లేదని ఆరోపించారు. వారికి ఈపీఎఫ్ కూడా లేదని గతేడాది అక్టోబర్‌లో ఒక మహిళా కార్మికురాలు ప్రమాదానికి లోనైనా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. స్వీపర్లకు రెండు నెలల నుంచి జీతాలు లేవన్నారు. కార్మిక నేత ప్రమోద్ మహంతి మాట్లాడుతూ 2020 ఫిబ్రవరిలో మిల్లు విక్రయించారని, కొత్త కంపెనీకి 250 ఎకరాల అప్పజెప్పారని, మిల్లు కొని 5 ఏళ్ల గడచినా కొత్త యాజమాన్యం బిజినెస్ ట్రాన్స్‌ఫర్ ఒప్పందాన్ని అమలు చేయలేదని విమర్శించారు. 200 కోట్లు అప్పుచేసిన కొత్త యాజమాన్యం మిల్లు నడపలేకపోతుందని, కనీసం కార్మికులకు వేతనాలు చెల్లించటం లేదన్నారు. మిల్లులో పనిచేస్తున్న కార్మికుల, విశ్రాంత కార్మికుల, కంట్రాక్ట కార్మికుల పరిస్థితి నేడు దయనీయ స్థితిలో ఉందన్నారు.

స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తహసీల్దార్

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్రలో అతి పెద్ద ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న స్టేడియం కోసం స్థలాన్ని గుర్తించేందుకు కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర, కుంద్ర తహసీల్దార్ బినోద నాయక్ ఆదివారం కుంద్ర పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కుంద్ర పంచాయతీ సమీపంలో బంశువాగుడ గ్రామ సమీపంలో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని సందర్శించి ఆ భూమి ఏ కోవలోనికి వస్తుంది, స్టేడియానికి ఎంత భూమి కేటాయించగలరో ఒక రిపోర్టు తయారు చేసి ఇవ్వాలని తహసీల్దార్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు. కుంద్ర సమీప చిలిగుడ రోడ్డు పక్కన గల అతి పెద్ద స్థలాన్ని గుర్తించారు. ఈ రెండు స్థలాల్లో అనువైనది ఎంపిక చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. స్టేడియం నిర్మాణానికి 10 ఎకరాల స్థలం అవసరం ఉంటుందని వెల్లడించారు. ముఖ్యంగా గ్రామీణ అడవులు, పత్ర జంగిల్‌లో నివసించకూడదనే ఆంక్షలు ఉండటంతో ఇళ్లు ఖాళీ చేయాలని మూడు గ్రామాల వారికి రెండు సార్లు నోటీసులు పంపారని, తమకు పునరావాసం కల్పించాలని సాగరగుడ, మరో రెండు గ్రామాల ప్రజలు కోరారు. కుంద్ర మండల బీజేపీ అధ్యక్షుడు పద్మనాభ బిశాయి, మండలి ప్రతినిధి అమ్ము పాత్రొ, పార్టీ కోఆర్డినేటర్ రామేశ్వర జెన, మిలన్ ప్రదాన్, అభినాశ్ బెహర, శంకర మహంతి, దయా హరిజన్, తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా కాంగ్రెస్‌కు చీఫ్ నియామకం ఎప్పుడో..?

భువనేశ్వర్: ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి మార్గదర్శకత్వం చేసేవారు లేకుండాపోయారు. గత 7 నెలలుగా అధ్యక్షుడు లేకుండా ఓపీసీసీ మనుగడ సాగిస్తోంది. అధ్యక్షుడిని ఖరారు చేయడంలో ఏఐసీసీ మెతక వైఖరి దీనికి కారణమని స్పష్టం అవుతుంది. పీసీసీ అధ్యక్షుడి పేరు ఎప్పుడు ప్రకటిస్తారోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అతి త్వరలో ఈ ప్రక్రియ పూర్తి అవుతుందనే అధిష్టానం నిర్ణయం కోసం రాష్ట్ర ప్రముఖులు నిరీక్షిస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మౌనంగా పరిస్థితిని పసిగడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడి ప్రకటనలో జాప్యంపై కాంగ్రెస్ కార్యకర్తల్లో, నిరుత్సాహం క్రమంగా కట్టలు తెంచుకుంటోంది. పీసీసీ అధ్యక్షుడి పేరును ఏఐసీసీ త్వరలో ప్రకటిస్తుందని రేసులో ఉన్న పార్టీ సీనియర్ నేత భక్త చరణ్ దాస్ పునరుద్ఘాటించారు. పీసీసీ అధ్యక్షుడిగా ఎవరనేది ఇప్పటికే ఖరారైంది. ఏ సమయంలోనైనా హైకమాండ్ ఈ పేరు ప్రకటిస్తుందన్నారు. ఒడిశా కాంగ్రెస్‌లో పీసీసీ అధ్యక్షుడిగా ఎందరో సమర్థులైన నాయకులు ఉన్నారని ఆయన అన్నారు.

ఘోష యాత్ర సన్నాహాలు


రథ నిర్మాణ శాల ప్రాంగణంలో రథ కలప దుంగలకు పూజలు

భువనేశ్వర్: పవిత్ర శ్రీపంచమి సందర్భంగా పూరీ శ్రీ జగన్నాథుని రథయాత్రకు తయారు చేసే రథాల కలప పూజలు నిర్వహించడం ఆచారం. 3 కొత్త రథాల తయారీ కోసం నిర్మాణ శాల ప్రాంగణానికి చేరిన తొలి విడత నుంచి ఒక్కో రథం కోసం లాంఛనంగా ఒక్కో దుంగని ఎంపిక చేసి ప్రత్యేకంగా పూజాదులు నిర్వహించడంతో అక్షయ తృతీయ నుంచి రథ తయారీ పనులకు అంకురార్పణ పూర్తవుతుంది. శ్రీ జగన్నాథ ఆలయ కార్యాలయంలో సరస్వతీ దేవిని పూజించిన తరువాత రథ కలప సంస్కరణ పూజాదులు నిర్వహించారు. ఒక్కో రథానికి ఒక్కో కలప దుంగ చొప్పున ఎంపిక చేసిన 3 కలప దుంగల్ని గజపతి మహా రాజా రాజగురువు ఆధ్వర్యంలో ఆలయ ఆచారాల ప్రకారం ప్రత్యేక సంస్కరణ పూజాదులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంగణంలో చున్నపు నీరు చల్లి శుద్ధి చేశారు. వసంత పంచమి తిథి నాడు ప్రత్యేకంగా పూజించిన కలప దుంగల్ని బలభద్ర స్వామి తాళ.ధ్వజం, సుభద్ర దేవి దర్పదళనం, శ్రీ జగన్నాథుని నందిఘోష్ రథాల ప్రధాన ఆధార భాగం తయారీలో వినియోగిస్తారు. శ్రీ మందిరం పాలక వర్గం, రథ కలప పర్యవేక్షకులు, భోయి సేవకులు, శ్రీమందిర పాలక మండలి అధికారుల సమక్షంలో సుమారు గంటపాటు పూజార్చనలు జరిపించారు. ఈ ఏడాది రథాల నిర్మాణానికి 865 కలప దుంగలు అవసరం కాగా మొదటి దశలో మొత్తం 101 దుంగల్ని నయాగడ్ అటవీ శాఖ పంపిణీ చేసింది.

చెక్‌డ్యామ్‌లో మృతదేహం


నీటిలో తేలుతున్న హరాన్ మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి పుసుగూఢ గ్రామం వద్ద గల చెక్‌డ్యామ్‌లో ఆదివారం ఓ మృతదేహం కనిపించింది. కలిమెల సమితి కేంద్రం వివేకానంద కాలనీకి చెందిన హరాన్ మండల్ అనే ఉపాధ్యాయుడు జనవరి 29 నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు 30వ తేదీన కలిమెల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆదివారం ఉదయం 11గంటల సమయంలో చెక్‌డ్యామ్‌లో మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు టీచర్ హరాన్ మండాళ్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. హరాన్ స్వగ్రామం కలిమెల సమితి మాన్యంకొండ పంచాయతీ యంపివి 42 గ్రామం. అక్కడి నుంచి రోజూ రాకపోకలు చేయలేక కలిమెలలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. రెండు నెలల కిందట కూడా బైక్‌ప్రమాదం జరిగింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా గంజాయి పట్టివేత


అడవిలో పట్టుబడిన గంజాయి బస్తాలతో పోలీసులు

జయపురం: దట్టమైన అడవిలో మాఫియా దాచి ఉంచిన గంజాయి పోలీసులకు చిక్కింది. జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ పోలీసులు జి.మరిఖిగుడ పంచాయితీ టికరపడ సమీప దట్టమైన అడవిలో బొయిపరిగుడ పోలీసులు పది క్వింటాళ్ల 23 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు బొయిపరిగుడ పోలీసు అధికారిణి దీపాంజళీ ప్రధాన్ ఆదివారం పత్రికా ప్రతినిధులకు సూచన ప్రాయంగా తెలిపారు. జి.మరిఖిగుడ పంచాయతీ టికరపడ అడవిలో పెద్ద ఎత్తున గంజాయి ఉందన్న సమాచారం విశ్వాసనీయవర్గాల ద్వారా తెలిసిందన్నారు. వెంటనే సబ్‌ఇన్‌స్పెక్టర్ సంజీవ్ బెహర అడవిలో గంజాయి విషయం తెలుసుకోమని ఆదేశించగా అతడు పోలీసు టీమ్‌తో వెళ్లి అడవిలో గాలించగా ఒక చోట 38 బస్తాల్లో ఉన్న గంజాయి కనుగొన్నారు. వాటిని సీజ్ చేసి బొయిపరిగుడ పోలీసుస్టేషన్‌కు తీసుకురాగా మెజిస్ట్రేట్ సమక్షంలో తూకం వేయగా.. పది క్వింటాళ్ల 23 కేజీలు ఉన్నట్లు దీపాంజళి ప్రధాన్ వెల్లడించారు. పట్టుబడిన గంజాయి జయపురం కోర్టుకు తరలించినట్లు ఆమె వెల్లడించారు. గంజాయి మాఫియ ఇతర ప్రాంతాలకు తరలించేందుకు దట్టమైన అడవిలో గంజాయి దాచి ఉంచారని ఆమె వెల్లడించారు. అడవిలో గంజాయి దాచి ఉంచిన మాఫియాగ్యాంగ్‌లో ఏఒక్కరి ఆచూకీ తెలియరాలేదన్నారు. పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నామన్నారు. త్వరలోనే గ్యాంగ్‌ను అరెస్టు చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీపంచమి


పర్లాకిమిడి: గాయత్రీ మందిరంలో సామూహిక ఉపనయనాలు


పర్లాకిమిడి: సరస్వతీ శిశు విద్యామందిర్ పాఠశాలలో సరస్వతీ దేవిని ప్రతిష్ఠించిన ఆచార్యులు

పర్లాకిమిడి: వసంత పంచమి సందర్భంగా స్థానిక సరస్వతీ శిశి విద్యా మందిర్‌లో భక్తిశ్రద్ధలతో సరస్వతీ దేవి పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, పాఠశాలల్లో పేర్లు నమోదు కార్యక్రమం చేశారు. గుండిచాబడి వద్ద గాయత్రీ మందిరంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, యుక్త వయస్సు బాలురుకు ఉపనయనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ పరివార్ సభ్యులు రజనీ చౌదురి, విఘ్నరాజ్ పండా, శివపట్నాయిక్, బిఘ్నేశ్వర దాస్, నిల్లు గంతాయత్, విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు కైలాష్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రాయగడలో..

రాయగడ: వసంత పంచమి పురస్కరించుకుని విద్యాలయాల్లో సరస్వతీ దేవి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పాఠశాలల్లో నిర్వహించే పూజా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

మోడరన్ ఇంగ్లిష్ పాఠశాలలో..

జయపురం: స్థానిక మోడరన్ ఇంగ్లిష్ పాఠశాలలో సరస్వతీదేవి పూజలు భక్తితో నిర్వహించారు. పలు విద్యా సంస్థల్లో సరస్వతీ పూజలు జరిగాయి.


రాయగడ: వివేకానంద పాఠశాలలో నిర్వహిస్తున్న సరస్వతీ దేవి


పర్లాకిమిడి: శిశుమందిర్ పాఠశాలలో నిర్వహిస్తున్న యాజ్ఞం


జయపురం: మోడరన్ ఇంగ్లిష్ స్కూల్‌లో సరస్వతీదేవి పూజలు


పర్లాకిమిడి: గాయత్రీ దేవి మందిరంలో ఉపనయనాలు, అక్షరాభ్యాసం

క్లుప్తంగా

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి కలకలం



సెల్‌టవర్‌పై ఉన్న అపరిచిత వ్యక్తి

జియ్యమ్మవలస: మండలంలోని ఏజెన్సీ పంచాయతీ పెదతోలుమండలో ఎయిర్‌టెల్ సెల్ టవర్ ఎక్కి ఓ అపరిచిత వ్యక్తి కలకలంసృష్టించాడు. ఆదివారం మధ్యాహ్నం సెల్‌టవర్ ఎక్కిన అపరిచిత వ్యక్తి గ్రామ గిరిజన ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు జియ్యమ్మవలస, చినమేరింగి ఎస్సైలు పి.ప్రశాంత్‌కుమార్, పి.అనిల్‌లు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దాదాపు మూడు గంటలు శ్రమించి అపరిచిత వ్యక్తిని టవర్‌పై నుంచి కిందికి దించారు. అపరిచిత వ్యక్తిని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తిగా పోలీసులు నిర్ధారించారు. అనంతరం ఆ వ్యక్తిని జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్‌కు తరలించి పరిస్థితి సమీక్షిస్తున్నారు.

నేడు చైర్మన్ ఎన్నిక

- ఏర్పాట్లు పూర్తి చేసి నగరపంచాయతీ అధికారులు

పాలకొండ: నగరపంచాయతీ చైర్మన్ ఎన్నిక సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 20 మంది కౌన్సిలర్లు, స్థానిక ఎమ్మెల్యే ఓటు హక్కు పొంది ఉన్నారు. వారందరికీ ఫారం-2 నోటీసులు అందించినట్లు కమిషనర్ సర్వేశ్వర రావు తెలిపారు. పార్టీ ఫిరాయించిన వారితో లెక్కవేస్తే టీడీపీకి 4, వైఎస్సార్‌సీపీకి 16 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ప్రస్తుతం తాత్కాలిక చైర్మన్‌గా పల్లా ప్రతాప్ కొనసాగుతున్నారు. 2వ వార్డు నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికై ప్రసుతం టీడీపీలో చేరిన కౌన్సిలర్లలో ఆకుల మల్లీశ్వరి మాత్రమే నిబంధనల మేరకు చైర్మన్ పదవికి పోటీలో ఉన్నారు. సభ్యులు అంగీకరిస్తే ఆమె చైర్మన్‌గా కొనసాగుతారు. లేని పక్షంలో తాత్కాలిక చైర్మన్‌ను కొనసాగించాల్సి ఉంటుంది. ఈ ఉత్కంఠకు సోమవారం తెరపడనుంది.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన అప్పల నాయుడు (ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని పోరలి గ్రామానికి చెందిన పిల్ల అప్పల నాయుడు (35) గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసి విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పెదమానాపురం ఎస్సై జయంతి ఆదివారం తెలిపారు. మృతుడి కుమారుడు రామునాయుడు ఫిర్యాదు మేరకు ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత నెల 31వ తేదీన మధ్యాహ్నం భోజనానికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతకగా ఆరోజు సాయంత్రం కళ్లంలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి వెంటనే గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తీసుకువెళ్లారు. గజపతినగరంలో వైద్య పరీక్షల అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం 108లో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సింహాచలం కుమారుడు కుమార్తె ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠినచర్యలు

విజయనగరం క్రైమ్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠినచర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా తమ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై 250 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రధాన కూడళ్ల వద్ద వాహన తనిఖీలు చేపట్టి, వాహనదారులకు రహదారి భద్రత, హెల్మెట్ ధారణ పట్ల అవగాహన కల్పించామన్నారు. ఎంవి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 393 కేసులు నమోదు చేసి, రూ.లక్షా 20వేల 640లు ఈ చలానాగా విధించామన్నారు. ప్రత్యేక డ్రైవ్‌ను విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ డి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించగా, సంబంధిత సీఐలు, ఎస్సైలు ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొని, దాడులు నిర్వహించారని ఎస్పీ వివరించారు.

చోరీ కేసునమోదు

బాడంగి: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ఆదివారం జరిగిన చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన చప్పకృష్ణ మూర్తి ఇంటిలో ఉదయం 10గంటల ప్రాంతంలో జరిగిన ఈ దొంగతనంలో బీరువాలో పెట్టిన రెండుతులాల బంగారు పుస్తెలతాడు, ముప్పాతిక గ్రాముల చెవి దిద్దులతోపాటు, రూ.12 వేలు చోరీకి గురైనట్లు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఇంటితలుపులు వేసి బయట తాళం ఉంచి చర్చికి వెళ్లి వచ్చి చూడగా బీరువా తాళాలు తీసి చిందరవందరగా పడి ఉండడం, బీరువాలో బంగారం, నగదు పోవడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు.

సర్పంచ్‌లకు పంచ్..!

- వారి అధికారాలు కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం
- జిల్లాలో 626 పంచాయతీలు
- సుమారు రూ.280 కోట్ల అంచనావ్యయంతో 2,851 పనులు
- అనధికార వ్యక్తులకు పనుల అప్పగింత
- ఎన్నికల ముందు ఎన్నో హామీలు
- అధికారంలోకి వచ్చాక చిన్నచూపు
- వెల్లువెత్తుతున్న విమర్శలు



నిర్వీర్యమవుతున్న మిర్తివలస పంచాయతీ కార్యాలయం



పాతరేగలో కూటమినేతలు నిర్మించిన సీసీ రోడ్డు

రామభద్రపురం: గ్రామస్వరాజ్య సాధనలో కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థకు దిశానిర్దేశం చేసేది సర్పంచులే. అలాంటి సర్పంచ్‌ల హక్కులు, అధికారాలను కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. జిల్లావ్యాప్తంగా వైఎస్సార్‌సీపీకి సంబంధించిన సర్పంచ్‌లు ఉన్నారనే అక్కసుతో ప్రభుత్వం వారిని పక్కన పెడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన అభివృద్ధి పనులను వెండర్‌కోడ్ పేరుతో ఇతరులతో చేయించి అవమానిస్తోంది. గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేది సర్పంచ్. అందుకే వారికి ప్రత్యేక అధికారాలు, విధులు కేటాయించారు. వారి విధులు, అధికారాలను కాలరాస్తే అది చట్ట విరుద్ధమని తెలిసినా కూడా ప్రభుత్వం అలాంటి చర్యలకు పాల్పడడం స్వార్థరాజకీయాలకు నిదర్శనమని పలువురు సర్పంచ్‌లు విమర్శిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 626 పంచాయతీలు ఉన్నాయి. ఉపాధిహామీ నిధులు సుమారు రూ.280 కోట్ల అంచనావ్యయంతో 2,851 పనులు చేపడుతున్నారు. ఈ పనులన్నీ కూటమి నేతలు అనధికార వ్యక్తులకు అప్పగించి చేయిస్తున్నారు.

సర్పంచ్ అధికారాలకు తూట్లు..

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లె పండగ పేరుతో ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్స్, తదితర అభివృద్ధి పనులు చేపడుతోంది. ఈ పనులు సంబంధిత గ్రామ సర్పంచ్ ఆమోదంతో తీర్మానించి చేయాల్సి ఉంది.అయితే చాలా గ్రామాల్లో సర్పంచ్‌ల ఆమోదం అవసరం లేకుండానే కాంట్రాక్టర్ పేరిట వెండర్ కోడ్ ప్రారంభించి పనులు చేయిస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత పంచాయతీ ఖాతాల్లో జమ చేయాల్సిన నిధులను వెండర్ల ఖాతాల్లోకి జమచేస్తున్నారు.అడ్డగోలుగా సాగుతున్న కూటమి పాలన తీరుపై సర్పంచ్‌లు విమర్శలు గుప్పిస్తున్నారు.

అధికారంలోకి వచ్చాక ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సర్పంచ్‌లకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదు. వారి విధులు, అధికారాలను ఎమ్మెల్యేల చేతిలోకి తీసుకున్నారు. సర్పంచ్‌లకు తెలియకుండానే పనుల తీర్మానం చేస్తున్నారు.ఆ పనులను వేరొకరికి అప్పగించి సర్పంచ్‌లను అవమానపరుస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.ఇవన్నీ డిప్యూటీ సీఎంకు తెలిసినప్పటికీ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ఎన్నికల ముందు ఇలా..

పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు పలు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వస్తే గ్రామ పంచాయతీలకు ప్రాణప్రతిష్ట కల్పిస్తామన్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం రావాలంటే పంచాయతీలు పరిపుష్టం కావాలని నీతులు చెప్పారు. సర్పంచ్‌ల అధికారాన్ని కాపాడి గౌరవ మర్యాదలు కల్పిస్తామని ఊదరగొట్టారు.

అధికారాలు కాలరాయడానికే హేతుబద్ధీకరణ..



సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ అసంబద్ధం. అలా చేయడం వల్ల ప్రజలకు ప్రయోజనం లేదు. సర్పంచ్‌ల అధికారాలు కాలరాయడానికే ఈ నిర్ణయం తీసుకున్నారు. సచివాలయాల రేషనలైజేషన్‌తో పంచాయతీ సర్పంచ్‌ల బాధ్యత ఏమిటో తెలియడం లేదు. గ్రామాల్లోని ప్రజలు, ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షనిర్ణయంతో నలుగురు అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీ అసంబద్ధ నిర్ణయాలతో హేతుబద్ధీకరణ చేసేందుకు నిర్ణయం తీసుకోవడం దారుణం.

మజ్జి రాంబాబు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు.

సర్పంచ్‌లకు ప్రాధాన్యం లేదు..



ఈ ప్రభుత్వం వచ్చాక సర్పంచ్‌లకు ఎందులోనూ ప్రాధాన్యం కల్పించడంలేదు. ఇలాంటి ధోరణి గతంలో ఎన్నడూ లేదు. పంచాయతీ పాలన మొత్తం సర్పంచ్ చేతుల మీదుగానే జరగాలనే నిబంధన ఉండేది. ప్రస్తుత ప్రభుత్వంలో అందుకు భిన్నంగా జరుగుతోంది. పంచాయతీ కార్యదర్శులు, అభివృద్ధి పనులు, సభలు, సమావేశాలకు ఆహ్వానించడం లేదు. కూటమి ప్రభుత్వ నేతలతోనే వాటిని జరిపిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న సర్పంచ్‌లకు ఈ దుస్థితి ఏమిటి? గ్రామ స్వరాజ్యాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది.

సోములు కుమారి, సర్పంచ్, రావివలస

వెండర్లతో పనులా?



ప్రజలతో ఎన్నికైన సర్పంచ్‌లను కాదని వెండర్లతో పనులు చేయించి వారి ఖాతాల్లో నిధులు జమచేయడం వింతగా ఉంది. బయట వ్యక్తులు పనులు చేయడం సర్పంచ్‌లను అవమానపరిచినట్లే. ఎన్నికలకు ముందు సర్పంచ్‌లకు ప్రాధాన్యమిస్తామని, ఏవో హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక సర్పంచ్‌ల పట్ల వివక్ష చూపుతున్నారు.ఈ ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ధోరణి మార్చుకోవాలి.

గొట్టాపు పైడిపునాయుడు, సర్పంచ్ భర్త, పాతరేగ

గుర్తింపు లేకుండా చేశారు..



కూటమి ప్రభుత్వం సర్పంచ్‌లకు గుర్తింపు లేకుండా చేసింది.ఇటీవల గ్రామంలో ఉపాధిహామీ పథకంలో పనులను చేపట్టారు.ఆ పనులను సర్పంచ్ అంగీకారం లేకుండానే జరిపిస్తున్నారు. పంచాయతీలో అభివృద్ధి పనులు ఆగకూడదన్న ఉద్దేశంతో అడ్డుకోవడం లేదు.ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు.

వైకుంఠం విజయభాస్కరరావు,సర్పంచ్ దుప్పలపూడి

బొబ్బిలిలో భారీ చోరీ

- 40 తులాల బంగారం, 20లక్షల నగదు అపహరణ
- కుటుంబసభ్యులు ఊరెళ్లిన సందర్భంగా ఘటన



ప్రధాన ద్వారానికి ఉన్న గొళ్లెం విరగ్గొట్టిన దృశ్యం



చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ సతీష్ కుమార్ తదితరులు

బొబ్బిలి: ప్రశాంతంగా ఉన్న బొబ్బిలిలో శనివారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. పెద్దస్థాయిలో చోరీ జరగడంతో పట్టణ వాసులు ఉలిక్కి పడ్డారు. పట్టణానికి చెందిన గ్రంధి రవికుమార్ శుక్రవారం విశాఖలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అంతకు రెండు రోజుల ముందే ఆయన భార్య, కుటుంబసభ్యులు కూడా విశాఖ వెళ్లారు. విశాఖ వెళ్లొచ్చాక కుంభమేళాకు వెళ్దామని కుటుంబ సభ్యులంతా నిర్ణయించుకున్నారు. అయితే ఆదివారం ఉదయం ఎప్పటిలాగే ఇంటిముందు పరిశుభ్రపరచి కళ్లాపు చల్లి, ముగ్గు పెట్టి వెళ్లే పనిమనిషి వచ్చేసరికి ఇంటి తలుపు తెరిచి ఉండటంతో ఆందోళన చెంది వెంటనే ఎదురింటి వారికి సమాచారమిచ్చి రవికుమార్‌కు విషయం తెలియజేయాలని కోరింది. దీంతో ఎదురింటి వారి ద్వారా సమాచారం తెలుసుకున్న రవికుమార్ హుటాహుటిన బొబ్బిలి వచ్చేశారు. రాగానే ఇంటిలో ఏమేం ఉంచాం? ఏమేం పోయాయో? ఓ సారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీరువాలో ఉంచిన 40 తులాల బంగారు ఆభరణాలు, అందులోనే మరో చోట ఉంచిన రూ.20 లక్షల నగదు పోయినట్లు వాపోయారు.

డీఎస్పీ పరిశీలన

పట్టణంలో భారీ దొంగతనం జరిగిందన్న విషయం తెలుసుకున్న బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి, సీఐ కె.సతీష్ కుమార్, ఎస్సైలతో కలిసి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఇంటిలో దొంగతనం ఎలా జరిగి ఉంటుందో పరిశీలించారు. ప్రధాన ద్వారానికి ఉన్న గొళ్లాన్ని కోసి లోనికి ప్రవేశించినట్లు స్పష్టంగా కనిపిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం క్లూస్ టీమ్‌కు సమాచారం అందజేశారు. ఈ లోగా చుట్టుపక్కల ఇళ్ల వారిని ప్రాథమికంగా విచారణ చేశారు. ఎవరైనా అనుమానితులు ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో సంచరించారా? అన్న విషయమై ఆరా తీశారు. ఆదివారం సాయంత్రం విజయనగరం నుంచి క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించింది. ఈ సందర్భంగా సీఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ డీఎస్పీ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలతో దొంగలను పట్టుకుని వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

విషాదం నింపిన కుంభమేళా

- కనిమెట్ట సమీపంలో రోడ్డుప్రమాదం
- పోలిపల్లి ఇంగ్లీష్ ఉపాధ్యాయిని మృతి
- మరో నలుగురికి గాయాలు



సౌజన్య మృతదేహం



ప్రమాదంలో దెబ్బతిన్న ఇన్నోవా కారు

పూసపాటిరేగ: ఉత్తరప్రదేశ్‌లో కుంభమేళాకు వెళ్లడానికి వందల కిలోమీటర్లు ప్రయాణించారు. కుంభమేళాలో పాల్గొని తిరుగు ప్రయాణంలో గంట వ్యవధిలో సంతోషంగా ఇంటికి చేరుకుంటామనుకున్న ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఆ కుటుంబం ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురవడంతో కారులో ప్రయాణిస్తున్న భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్తతో పాటు కుటుంబసభ్యలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పూసపాటిరేగ మండలంలోని కనిమెట్ట సమీపంలో ఆదివారం ఉదయం జరిగింది. సంఘటన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నంలోని పోతినమల్లయ్యపాలానికి చెందిన కెంగువ రవికుమార్, భార్య సౌజన్య, కుమారుడు హృదయ్, కుమార్తె హంసిక, అత్త భోగి భవాని, డ్రైవర్ మనపరాజు ప్రసాద్‌లు కలిసి మహారాష్ట్రలో కుంభమేళాకు జనవరి 27 వతేదీన వెళ్లారు. కుంభమేళా అనంతరం తిరుగు ప్రయాణంలో ఫిబ్రవరి 1 వతేదీన విశాఖలోని పోతినమల్లయ్యపాలానికి కారులో తిరిగి బయల్దేరారు. మరో గంట వ్యవధిలో స్వగ్రామం చేరుకోబోతుండగా 2 వతేదీ ఉదయం 6 గంటల సమయంలో పూసపాటిరేగ మండలం కనిమెట్ట సమీపంలో వారు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సౌజన్య(41)కు తీవ్రగాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రవికుమార్‌కు కాలు విరగడంతో పాటు తీవ్రగాయాల య్యాయి. అత్త భవాని, పిల్లలు హృదయ్, హంసిక, డ్రైవర్ ప్రసాద్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. మృతిచెందిన సౌజన్య భోగాపురం మండలంలోని పోలిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయిని. ఉపాధ్యాయిని సౌజన్య అనుకోని ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబసభ్యులతో పాటు తోటి ఉపాధ్యాయులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తీవ్రంగా గాయపడిన రవికుమార్ కొమ్మాది గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో గత 15 ఏళ్లగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. సౌజన్య మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తులను చికిత్స నిమిత్తం విజయనగరంలోని తిరుమల మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర తైక్వాండోలో బంగారు పతకం



కోచ్‌లతో పవిత్ర



జాజిలిని అభినందిస్తున్న డైరెక్టర్ తదితరులు

బాడంగి: రాష్ట్రస్థాయిలో అండర్-17 విభాగంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో బాడంగి మండలంలోని ముగడ గ్రామానికి చెందిన అలజంగి పవిత్ర బంగారు పతకం సాధించింది. పవిత్ర ప్రస్తుతం విశాఖజిల్లా మధురవాడలోని చంద్రంపాలెం ప్రభుత్వ జిల్లాపరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. కాకినాడలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 తైక్వాండో పోటీలలో తమ కుమార్తె బంగారుపతకం సాధించినట్లు తండ్రి ప్రసాద్ చెప్పారు. ఈ ప్రాంతానికి చెందిన పవిత్ర బంగారు పతకం సాధించడంతో మండల ప్రజలు అభినందించారు.

రాష్ట్రస్థాయి తైక్వాండోలో బాలిక ప్రతిభ

బొబ్బిలి: పట్టణంలోని ఐరిస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సదాశివుని జాజిలి విజయనగరంలో జిల్లా స్థాయి, తాడిపత్రిలో జరిగిన తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి, చివరగా హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర రెడ్డి స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సిల్వర్ పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఆమెను అభినందించారు. ఈ మేరకు ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ వింజమూరి విజయకుమార్ శర్మ, సిబ్బంది ఆమెకు స్వీట్లు తినిపించి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర రావు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులకు నంది అవార్డులు



అక్కివరపు గౌరీశ్వరికి నంది అవార్డును అందిస్తున్న నిర్వాహకులు



రమణమూర్తికి నంది అవార్డు అందిస్తున్న సంస్థ నిర్వాహకులు

రాజాం: రాజాం పట్టణానికి చెందిన రంగస్థల కళాకారిణి అక్కివరపు గౌరీశ్వరి, సంతకవిటి మండలం మందరాడ గ్రామానికి చెందిన ప్రముఖ హార్మోనిస్ట్, శ్రీమజ్జిగారి కళానికేతన్ నిర్వాహకుడు వావిలపల్లి రమణమూర్తిలకు తెలుగు వెలుగు సాహితీవేదిక నంది అవార్డులు అందించింది. వారి సేవలను గుర్తించిన తెలుగుసాహితీ వేదిక స్వామి వివేకానంద జయంతి మహోత్సవాల సందర్భంగా నంది అవార్డులకు ఎంపికచేసింది. ఈ మేరకు ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ అవార్డులను ఆ సంస్థ జాతీయ చైర్మన్ పోలోజ్ రాజ్‌కుమార్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్. సంస్థ కోఆర్డినేటర్లు బాణాల రాజుచారి, జోనిగోని యాదగిరిగౌడ్‌లు వారికి అందజేశారు. ఈ సందర్భంగా వారిని పద్మశ్రీ యడ్ల గోపాలరావుతో పాలు పలువురు కళాకారులు, రాజాం పట్టణ ప్రజలు అభినందించారు.

అక్షరాభ్యాసాలకు సర్వం సిద్ధం

- ముస్తాబైన జ్ఞానసరస్వతి ఆలయం
- ఐదువేల మంది పైగా చిన్నారులకు కార్యక్రమం



అక్షరాభ్యాసం మంటపం వద్ద ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



పుష్పాలంకరణలో వసంతపంచమికి ముస్తాబైన జ్ఞానసరస్వతి అమ్మవారు

విజయనగరం టౌన్: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రింగురోడ్డులో కొలువైన జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శారదా సేవా సంఘం ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం వేకువజామునుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనల అనంతరం 6 గంటల నుంచే అక్షరాభ్యాసాల ప్రక్రియ నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 5200 మందికి పైగా చిన్నారులు అక్షరాభ్యాసంలో పాల్గొననున్నారు. ప్రతి 45 నిమిషాలకు ఒక బ్యాచ్ చొప్పున చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించేందుకు రంగం సిద్ధం చేశారు. సాయంత్రం 6 గంటల వరకూ నిర్వహించే కార్యక్రమంలో ఇప్పటికే టికెట్లను భక్తులకు అందజేశారు. అప్పటికప్పుడు వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా స్పెషల్ కౌంటర్లను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు, సేవకులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ఘనంగా కనికరమాత యాత్ర



మేరీమాతను ప్రత్యేక పల్లకీలో పూలతో అలంకరించి ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు



దేశంలో అత్యంత ఎత్తైన క్రీస్తు గొర్రెల కాపరి ప్రతిమ వద్ద భక్తులు

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కొత్తవలస: మండలంలోని కొండడాబాల వద్ద ఉన్న వ్యాకులమాత యాత్ర ఆదివారం భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ ఆలయానికి 133 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉంది. ఏటా ఫిబ్రవరి నెలలో మొదటి ఆ దివారం నిర్వహించే ఈ యాత్రకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ చర్చిలో 1914వ సంవత్సరంలో పారిస్ నుంచి తీసుకొచ్చి ప్రతిష్ఠించిన వ్యాకులమాత ప్రతిమను కులమతాలకు అతీతంగా ఆరాధించడం ఇక్కడి ప్రత్యేకత.

ముగిసిన నవీనా ప్రార్థనలు

ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రకృతి సోయగాల నడుమ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న కొండపై గత తొమ్మిది రోజులుగా ఫాదర్ గొంగాడ రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవీనా ప్రార్థనలు శనివారం రాత్రి ము గిశాయి. కనికరమాతను అలంకరించి ప్రత్యేక పల్లకిలో ఉంచి క్రైస్తవ సోదరలు భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. విశాఖపట్నంలోని జ్ఞానాపురం అతిమేత్రాణులు డాక్టర్ మల్లవరపు ప్రకాశ్ ఆధ్వర్యంలో పలువురు విచారణ కర్తలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



శిలువుపై ఉన్న ఏసుక్రీస్తు వద్ద దీపాలను వెలిగిస్తున్న భక్తులు

పటిష్టమైన బందోబస్తు

యాత్రకు వేలాది మంది తరలి రావడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు సంభవించకుండా విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు ఆధ్వర్యంలో, సీఐ వి.చంద్రశేఖర్ పర్యవేక్షణలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే భక్తుల రాకపోకలకు గాను సింహాచలం, మద్దిలపాలెం ఆర్‌టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీస్‌లను నిర్వహించారు. మొత్తంగా యాత్ర ప్రశాంతంగా ముగిసింది.